**దేశ శ్రేయస్సుకై అన్ని పార్టీలు ఏకం కావాలి**

దివ్యాత్మ స్వరూపులారా!

నేను ఒక రాష్ట్రాన్ని గురించిగాని, ఒక ప్రదేశాన్ని గురించిగాని మాట్లాడను. నాకు అట్టి భేదము లేదు. ।ఒక్క భారతదేశమే నాకు ప్రధానము.

పరమ పావనమైన భారతావనియందు
సహనమన్నదె మనకు చక్కదనము
వ్రతములన్నింటను వన్నెగాంచినయట్టి
ఘనసత్యశీలమే కఠిన తపము
మధుర భావంబేది మన దేశమందన్న
మాతృభావము కంటె మాన్యమెద్ది
ప్రాణంబు కంటెను మానంబె ఘనమను
మన దేశ నీతిని మంటగలిపి
నేటికిచ్చిరి పరదేశ నీతులరసి
వెస విచిత్ర స్వేచ్ఛయను విచ్చుకత్తి
ఔర! ఏమందు భరత పాలనంబు
ఏనుగెట్టుల తన బలమెరుగలేదొ
అట్టులైనారు భారతీయులు నేడు.

భారతీయులందరూ కలసి భారతదేశమును భాగ్యవంతముగా తీర్చిదిద్దాలి. అది ఒక్క ప్రేమ ద్వారానే సాధ్యమౌతుంది. ఆత్మతత్త్వమొక్కటే అందరినా ఏకం గావిస్తుంది.

మతములన్నియు వేరు మార్గంబు ఒక్కటే
వస్త్రభేదము వేరు దారమొకటె
శృంగారములు వేరు బంగారమొక్కటే
పశుల వన్నెలు వేరు పాలు ఒకటె
జీవజంతులు వేరు జీవుండు ఒక్కడే
కులములన్నియు వేరు పుట్టుకొకటె
దర్శనంబులు వేరు దైవంబు ఒక్కడే
పూల వన్నెలు వేరు పూజ ఒకటె
తలియలేకను మానవుల్ తెలివిదప్పి
బ్రతుకు కోసము బహుబంధ బద్ధులైరి
ఇంతకన్నను వేరెద్ది ఎరుక పరతు
సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులార!

కనుక, ప్రేమస్వరూపులారా! మనము ఎట్టి భేదమూ పెట్టుకోకూడదు. అందరి హృదయమందు ఒక్క ఆత్మ మాత్రమే ప్రకాశిస్తున్నది. వేష, భాషలు వేరువేరు కావచ్చు. రూపములు వేరైనా, నామములు వేరైనా అందరిలో వున్న ఆత్మతత్త్వం ఒక్కటే అనే సత్యాన్ని గుర్తించి వర్తించినవాడే నిజమైన భారతీయుడు. భేదములన్నీ వ్యక్తులు కల్పించుకున్నవే. కేవలం గుర్తుకోసం ఒక్కొక్క రూపానికి ఒక్కొక్క పేరు పెట్టుకుంటున్నారు. దైవత్వమునకు ఎట్టి రూపమూ లేదు. దానినే 'ఆత్మ' అన్నారు. దానిని మనం ఆధారం చేసుకోవాలి. దానినే మనం ప్రేమించాలి. అదే నిజమైన మానవతా గుణము. అదే సత్యము, ధర్మము, శాంతి, ప్రేమ, అహింస. ఎక్కడ ప్రేమ వుంటుందో అక్కడే శాంతి వుంటుంది. సత్యము ఒక్కటే. అది రెండు కాదు. అట్టి సత్య మార్గమును అనుసరిస్తూ వుంటే మనకు ఎట్టి ఆపదలూ, ఎట్టి కష్టములూ సంభవించవు.

ప్రతి మానవుడుకూడను సాటి వ్యక్తులను అన్నదమ్ములవలె, అక్కచెల్లెళ్ళవలె ప్రేమించాలి. అదే నిజమైన భక్తి. లౌకిక జీవితములో మన కర్తవ్యమును మనం నిర్వర్తించాలి. ఆధ్యాత్మికములో అందరియందు ఒకేవిధమైన ప్రేమను

కలిగియుండాలి. నీకెవరైనా విరోధి ఎదురైతే మొహం ప్రక్కకి తిప్పుకోకూడదు. 'హలో బ్రదర్, హౌ ఆర్ యు?' అని పలుకరించాలి. అప్పుడు అతడుకూడను 'హౌ ఆర్ యు బ్రదర్' అని నిన్ను పలకరిస్తాడు. 'హెల్ప్ ఎవర్, హర్ట్ నెవర్' ఎవ్వరినీ మనం బాధించకూడదు. 'లవ్ ఆల్, సర్వ్ ఆల్'.అందరినీ ప్రేమించాలి. ఆ ప్రేమ దైవత్వానికి చేరిపోతుంది. ప్రేమయే అందరినీ ఆకర్షిస్తుంది.

దైవత్వమును మనలోనే పెట్టుకొని అది ఎక్కడో ఉన్నదని భ్రమించి దానికోసం ప్రాకులాడటం అజ్ఞానం. దైవత్వము మనయందే వున్నదన్న 'సెల్ఫ కాన్ఫిడెన్స్'ను పెటుట్టకోవాలి. ఆత్మవిశ్వాసము వున్నప్పుడే ఆత్మసంతృప్తి కలుగుతుంది. ఆత్మసంతృప్తి కలిగినప్పుడే స్వార్థాన్ని త్యాగం చేస్తావు. ఎప్పుడు స్వార్థాన్ని త్యాగం చేస్తావో అప్పుడే ఆత్మసాక్షాత్కారం కలుగుతుంది. కాబట్టి, ఆత్మసాక్షాత్కారమంటే ఏదో బయటనుంచి తెచ్చుకొనేది కాదు. మీరు ఏ కోటీశ్వరడినైనా అడిగి చూడండి. 'ఏమండీ, మీరు బాగున్నారా?' అని ప్రశ్నిస్తే, 'నాకు డబ్బుంది. ఇళ్ళున్నాయి. అన్నీ వున్నాయిగానీ మనశ్శాంతి లేదు' అంటాడు. శాంతి అనేది బయట లేదు. మనలోనే వుంది. నీలోనే వున్న పీస్‌ని నీవు పీసెస్ చేసుకోటం చేతనే నీకు పీస్ లేనట్లుగా అనిపిస్తోంది.

మనము ఎట్టి భేదములూ పెట్టుకోకుండా ప్రేమచేత ఐకమత్యంగా పెరగాలి. జగత్తులో మనమంతా ఒకే కుటుంబానికి చెందినవారము. అందరం ఒక ఫ్యామిలీగా వుండటానికి బదులువేరువేరుగా భావించుకొని దేశాన్ని చెడుపుకుంటున్నాము. మనము ఎట్టి భేదానికీ చోటివ్వకూడదు. వేదము చెప్పింది, 'నకర్మణా నప్రజయా ధనేన త్యాగేనైకే అమొతత్త్వ మానశుః' డబ్బు ఈనాడు వుంటుంది. రేపు పోతుంది. ఏదీ శాశ్వతము కాదు. ఆత్మతత్త్వము ఒక్కటే శాశ్వతము. దానిని మనం ఆధారం చేసుకోవాలి. ఏ భేదమూ పెట్టుకోకుండా అందరినున్న ఆత్మతత్త్వము ఒక్కటే అనే భావము పట్టుకుంటే అందరికీ ఆనందము కలుగుతుంది. 'అతను సంతోషంగా వున్నాడు, నేను దుః ఖముగా వున్నాను'. ఈవిధమైన భేదములు ఎందుకు వస్తున్నాయి? దుఃఖము, ఆనందము రెండు వేరువేరు కావు. రెండు బాధల మధ్య విరామమే ఆనందము. బాధలే లేకపోతే ఆనందమే కలుగదు. కనుకనే మనము ఈ రెండింటినీ సమానముగా చూచుకోవాలి.

బీదలను చూస్తే నాకు ఎంతో బాధ వేస్తుంది. ఒకతూరి నేను రాజమండ్రినుంచి కారులో మద్రాసుకు వస్తున్నాను. కారులో నాతోబాటు ఇద్దరు భక్తులున్నారు. మా వెనుక అనేక కార్లు వస్తున్నాయి. ఇక్కడికి వస్తుంటే ఒకచోట 'ఇదేమిటి?' అని అడిగాను. 'ఇది రెడ్‌పిల్స్' అని చెప్పారు. అక్కడికి వచ్చి నిలిచే వర్షపునీటిని పంటలకు పెట్టుకుంటారని చెప్పారు. అప్పుడు వర్షాలు లేకపోవటం వలన అది నిరుపయోగంగా వుంది. చిన్నచిన్న పిల్లలు అక్కడ మురికి గుంటల్లో వున్న నీటిని త్రాగటం మాకు కనిపించింది. అదే నీటిని పంటకు కూడా ఉపయోగపెడుతున్నారని చెప్పారు.అటువంటి కలుషితమైన నీటిని త్రాగటంవల్ల ఆరోగ్యాన్ని మనం చేతులారాపాడుచేసుకున్నవారమౌతున్నాము. మన ఆరోగ్యముపై ప్రభవం చూపేవి ముఖ్యముగా మూడు, నీరు, భోజనము, మనం సంచరించే వాతావరణము. ఈ మూడూ పరిశుద్ధమైనవిగా వున్నప్పుడే మానవుని ఆరోగ్యం చక్కగా వుంటుంది. ఈనాడు మనం త్రాగే నీరు, తినే తిండి, పీల్చే గాలి సరిగా లేకపోవటంచేతనే మన ఆరోగ్యం చెడిపోతున్నది.

నేను చెప్పాను, 'అయ్యా! మన మద్రాసులో కావలసినంతమంది ధనవంతులున్నారు. వీరంతా ఎందుకు త్యాగమునకు పూనుకోకూడదు? తమ ఇంటి ముందుకు ఎవరైనా భిక్షగాడు వస్తే వారిని తరిమి పంపుతారు. లేకపోతే వానిపైకి కుక్కల్ని విడుస్తారు. సమాజ సంక్షేమంకోసం ఒక్క నయాపైసా అయినా ఇస్తున్నారా? దేశానికి, ప్రజలకు కొంతవరకైనా సహాయం చేయకూడదా? మంచినీరందించి దాహార్తుల బాధను నివారణ గావించకూడదా? సినీమాలకు, సిగెరట్లకు, కాఫీలకు, తిండితీర్థాదులకు కావలసినంత డబ్బు ఖర్చుపెడతారు. ఈవిదంగా డబ్బును దుర్వినియోగం చేసే బదులు బీదపిల్లలకు గ్రుక్కెడు మంచినీరందించటానికి మీకు చేతకాదా?' మానవునికి ఆరోగ్యము, విద్య, నీరు ఈమూడూ ప్రధానమైనవి. ఈనాటి పరిస్థితి చూస్తే, ఏ చిన్న క్లాసులో ఎడ్మిషన్ కావాలన్నా ఎంతో డబ్బు కట్టాలి. దానిపైన నెలనెలా ఫీజులు చెల్లించాలి. బీదప్రజలు అంత డబ్బును ఎక్కడనుండి తేగలరు? 'మన వద్దనున్న డబ్బు మనది కాదు. ఇది భగవంతుని వరప్రసాదము' అనే పవిత్రమైన భావముతో ఆ డబ్బును ప్రజల సంక్షేమం కోసం వినియోగించాలి.

అలెగ్జాండర్ అనేక దేశాలను జయిస్తూ సింధునది దాటి హిందూదేశంపై పడాలని వచ్చాడు. కాని, అతని ఆరోగ్య పరిస్థితి క్షీణించింది. డాక్టర్లు వచ్చి పరీక్షించి, 'పరిస్థితి చాలా ప్రమాదకరంగా వుంది. ప్రాణం ఇక కొద్ది సేపు మాత్రమే నిలుస్తుంది' అన్నారు. అప్పుడు అలెగ్జాండర్ మంత్రులను పిలిచి, 'నా ప్రాణం పోయిన తరువాత ఈ దేహాన్ని

మన దేశానికి తీసుకువెళ్ళి ఒక తెల్లని బట్టలో చుట్టి, చేతులు మాత్రం పైకి పెట్టి వీధివీధిలోనూ ఊరేగించండి. 'మహారాజుకు ఎందుకింత అవమానం చేస్తున్నారు?' అని ప్రజలు మిమ్మల్ని ప్రశ్నించవచ్చు. 'ఇది అవమానం చేయటం కాదు, ప్రపంచానికి ఒక గొప్ప సందేశాన్ని చాటే నిమిత్తమై మహారాజే ఈవిధంగా చేయమన్నారు' అని చెప్పండి' అన్నాడు. ఏమిటా సందేశం? 'అలెగ్జాండర్ ఎన్ని దేశాలు జయించినా, ఎంత ధనాన్ని కూడబెట్టినా, ఎంత సైన్యం తన చుట్టూ వున్నా కట్టకడపటికి పోయేటప్పుడు తాను వట్టి చేతులతోనే పోయాడు' అనే విషయాన్ని ప్రపంచానికి చాటాలని ఉద్దేశ్యం.

ఎంత సంపాయించినా మనం ఎవరికోసం దాచిపెట్టాలి? నీవు జాగ్రత్తగా కూడబెట్టిన సొమ్మంతా నీ బిడ్డలు వృధాగా ఖర్చు చేయవచ్చు. కనుక, నీవు జీవించి ఉండగానే సంపాదించిన ధనమును సద్వినియోగం చేయాలి. నేను నాకొరకు ఒక్క దమ్మిడీని ఉంచుకోను. ఎవరైనా డబ్బు పంపితే దానిని నేరుగా బ్యాంకుకు పంపిచేస్తాను. ఆ డబ్బునే నేను ఈవిధంగా మంచినీటి పథకాలకు ఖర్చు పెడుతున్నాను. నేనీవిధంగా సత్కార్యాలు చేస్తూ రావటం చేత బ్యాంకుకు ఎక్కువగా వస్తుండాది డబ్బు. దానిని బ్యాంకులో పెట్టుకొనేది దేనికోసం? సరియైన రీతిలో ఖర్చు పెట్టటం కోసం. అనేక గ్రామాల్లో చిన్నచిన్న పిల్లలు స్కూళ్ళకోసం అనేక మైళ్ళ దూరం నడచి పోవలసి వస్తోంది. ఆయా గ్రామాల్లో స్కూళ్ళు పెట్టి ఆ పిల్లలకు సహాయం చేయండి. చాలామంది తల్లులు తమ బిడ్డలకు ఏదైనా అనారోగ్యం కలిగితే డాక్టర్లకు చూపించటానికి వాళ్ళను ఎత్తుకొని ఎక్కడో దూరంగా వున్న ఆసుపత్రులకు వెళ్ళవలసివస్తోంది. కనుక, ప్రతి పల్లెలోనూ ఒక ఆసుపత్రి పెట్టండి. అనేక గ్రామాల్లో ప్రజలు నీరు లేక అవస్థపడుతున్నారు. అక్కడక్కడ బోర్‌వెల్స్ త్రవ్వి దాంట్లో వచ్చిన నీటిని త్రాగుతున్నారు. కాని, అది ఎంతకాలము వస్తుంది? కొంతకాలము తరువాత ఎండిపోతుంది. మద్రాసువాళ్ళు, 'స్వామీ! మాకు త్రాగటానికి నీరు లేదు' అన్నారు. 'మీరేమీ భయపడకండి. అందరికీ దేవుడున్నాడు. ఆయనను ప్రార్థన చేయండి. తప్పక మీకు నీరు లభిస్తుంది. కొద్ది దినాలలోనే మద్రాసుకు త్రాగునీరు యిస్తాను' అని చెప్పాను. ఇంతేకాదు, పంటలకు కావలసిన నీరుకూడా అందస్తానని చెప్పాను.

సరియైన వైద్యసహాయం అందక పేద ప్రజలు పడుతున్న అవస్థ చీచి నేను హాస్పిటల్స్ కట్టించాను. రెండు సూపర్ స్పెషాలిటీ హాస్పటల్స్ నెలకొల్పాను. ఒక్కొక్క బిల్డింగుకు కోట్లాది రూపాయలు ఖర్చయింది. ఆ హాస్పిటల్స్‌లో చేరిన వారికి ఫ్రీగా భోజనం పెడుతున్నాము. వైద్యాలయాలే కాదు, మేము విద్యాలయాలుకూడా కట్టించాము. ఎందరో పిల్లలు ఎక్కడెక్కడనుండో వచ్చి చేరుతున్నారు. వీళ్ళెవరిదగ్గరనుండి ఒక కాసైనా కలెక్టు చేయటం లేదు. ఎగ్జామినేషన్ ఫీజు కూడా లేదు. ఆవిధంగా విద్యను పూర్తిగా ఉచితంగా అందించటం చేత కొన్ని వేలమంది వచ్చి చదువుకొని పోతున్నారు. (భగవాన్ ఆదేశం మేరకు కొందరు విద్యార్థులు వేదికపైకి వచ్చి నిలబడ్డారు) వీళ్ళంతా పోస్టు గ్రాడ్యుయేట్లు. ఎం.ఎ., ఎమ్.ఎస్.సి., ఎమ్.బి.ఎ. ఇలాంటి పెద్దపెద్ద కోర్సులు పూర్తిచేసి నావెంట తిరిగుతున్నారు. 'మాకేమైనా పని ఇవ్వండి స్వామీ! మేము చేస్తాము' అంటున్నారు. అందుకోసమే వాళ్ళకు 'విలేజి వర్క్' ఇచ్చివేశాను. పల్లెల్లో ఉన్న బీదవారికి ఇంటింటికీ పోయి ఆహారం అందించాలి. ఈవిధంగా బీదలకు సేవ చేయకపోతే చదివిన చదువు వల్ల ఏమి ప్రయోజనం! ఈ దేశంలో ఎంతమంది గొప్పగొప్ప చదువరులు లేరు! కాని, వాళ్లు సంపాదనలో హీరోలు, సేవలో జీరోలు!సంపాదన ప్రధానం కాదు. మనం చేసే పని ప్రధానం. చదివిన చదువును వ్యర్థం చేయవద్దు. దానిని సమాజ సేవలో ప్రవేశపెట్టినప్పుడే సార్థకమౌతుంది. (ఒక విద్యార్థిని చూపిస్తూ) ఈ పిల్లవాడు హిమాచల్ ప్రదేశ్‌వచ్చాడు. అమెరికా, రష్యా, ఇంకా ఎక్కడెక్కడనుండో వస్తున్నారు. రష్యన్లు అనేకమంది వస్తున్నారు. వారికి ఎంత భక్తి! ఎంత భక్తి! ఎంత భక్తి! 'మీరు ఇంటింటికీ పోయి భోజనం పెట్టాలి' అని చెప్పి వారిని మా కాలేజి పిల్లలతోబాటు గ్రామాలకు పంపించాను. ఒక్కొక్క ఇంటికి వెళ్ళి వాళ్ళు ఆహారం, దుస్తులు అందిస్తున్నారు. ఈ సేవలో పాల్గొంటూ వారు ఎంతో ఆనందాన్ని అనుభవిస్తున్నారు. గ్రామాల్లో ప్రజలు పొందుతున్న ఆనందం వర్ణనాతీతం.

అన్నదానముకన్న అధిక దానంబేది!
తల్లిదండ్రులకన్న దైవమేది!
జపతపంబులకన్న సత్యశీలంబేది!
సుజన సంగతికన్న చూడ లాభంబేది!
క్రోధముకన్న శత్రుత్వమేది!
దయకంటె ఎక్కువ ధర్మమేది!

దయతో కూడిన మానవుడే నిజమైన మానవుడు. దయ లేనివాడు మానవుడనే పేరుకే అనర్హుడు. మనం మానవులుగా

పుట్టాము. 'నేను మానవుడను' అని చెప్పుకుంటూ మృగమువలె ప్రవర్తించకూడదు. పోట్లాడటము, చంప్కబిటము మృగలక్షణాలేగాని, మనుష్యులయొక్క లక్షణాలు కావు. కోతులలో సహితం కనిపించని స్వార్థం ఈనాటి మనిషిలో కనిపిస్తోంది. స్వార్థం తప్ప పరార్థమనేది కనిపించటం లేదు. ఏ పని చేసినా కేవలం తన స్వార్థ, స్వప్రయోజనాలను లక్ష్యమునందు ఉంచుకుంటున్నాడు. సంగీతము, సాహిత్యము, రాజకీయము మొదలైన అన్ని రంగాలూ స్వార్థంతో కలుషితమైనాయి.

ప్రేమస్వరూపులారా! మీరందరూ మంచి మనసుతో వుండి ఒకరినొకరు ప్రేమించండి. ఎవ్వరినీ ద్వేషించకండి. అందరి క్షేమాన్ని కోరండి. లోకమంతా సుఖముగా వున్నప్పుడే మనముకూడా సుఖముగా వుండగలము. లోకములో సుఖము లేకపోతే మనకు మాత్రమే ప్రతేయకంగా ఎట్లా వస్తుంది సుఖము! కాబట్టి, నిత్యమూ 'లోకాస్సమస్తా సుఖినో భవంతు' అని ప్రార్థించండి. మీరంతా అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళవలె కలసి మెలసి వుండాలని నేను ఆశిస్తున్నాను. ధనము పొట్టను నింపుతుందేగాని, మనస్సుకు సంతృప్తి కలిగించలేదు. Money comes and goes, morality comes and grows. కనుక, నైతిక విలువలను అభివృద్ధి పరచుకోండి. అప్పుడే మనము నిజమైన మానవులమని పేరు పొందుతాము.

ఆధ్యాత్మ మార్గంలో గట్టి పట్టుదల అవసరం. ఒక్కదానిని పట్టుకున్నప్పుడు, ఏమైనా సరే దానిని వదలకూడదు.

పట్టినదేదియో పట్టనే పట్టితివి
    పట్టునెగ్గెడుదాక అట్టెయుండు
కోరినదేదియో కోరనే కోరితివి
    కోర్కె చెల్లెడుదాక కొలచియుండు
అడిగినదేదియో అడగనే అడిగితివి
    అడిగినదిడుదాక విడువకుండు
తలచినదేదియో తలచనే తలచితివి
    తలపు తీరెడుదాక తరలకుండు
పోరు పడలేక తానైన బ్రోవవలయు
ఒడలు తెలియక నీవైన అడగవలయు
అంతియేగాని మధ్యలో ఆపివేసి
తిరిగి పోవుట భక్తుని దీక్షకాదు.

ఎవరికైనా కష్టం వస్తే మీరు పదిమంది పోయి వారితో ప్రేమగా మాట్లాడండి. అదే వారికి ఎంతో తృప్తి కలిగిస్తుంది. మనమందరం దైవస్వరూపలమే! ఒక్క సాయిబాబా మాత్రమే దేవుడనే భావము మీరు పెట్టుకోకూడదు. మీ అందరియందు దేవుడున్నాడు. మీరందరూ దేవుళ్ళే! కనుక, అందరినీ దైవస్వరూపులుగా భావించుకొని అందరికీ సహాయం చేయండి. అదే ముఖ్యమైనది. ఈ సత్యాన్ని గుర్తించి వర్తించినవారు ఎంతనో బాగుపడతారు. ఒక పార్టీగాని ఒక వ్యక్తినిగాని ఉద్దేశించి నేను చెప్పటం లేదు. దేశ శ్రేయస్సుకొరకు నేను చెబుతున్నాను. వ్యక్తి బాగుపడితే దేశమంతా బాగుపడుతుంది. చేతికి ఐది వేళ్ళున్నాయి. ఇవన్నీ ఏకమైనప్పుడే ఒక వస్తువును పట్టుకోటానికి వీలవుతుంది. అదేవిధముగా అన్ని పార్టీలవారు ఏకం కావాలి. ఒక పార్టీ వారిని చూచి మరొక పార్టీవారు ద్వేషించకూడదు. వాళ్ళ ఇష్టమును వాళ్ళు అనుభవించనీ. నీ ఇష్టము నీవు చూసుకో. అంతేగాని, ఇంకొక పార్టీనిగాని, ఇంకొక మతాన్నిగాని మనము ద్వేషించకూడదు. కనుక, మీరు ఎవ్వరినీ ద్వేషించకుండా ఐకమత్యముతో అందరూ ఏకంగా ఉండాలని నేను ఆశిస్తున్నాను.